పరాగ్ పరాక్రమం

రాజస్థాన్ రాయల్స్‌కు రెండో విజయం • ఛేదనలో తడబడ్డ ఢిల్లీ

స్టబ్స్ పోరాటం వృథా

వారం రోజుల క్రితం మొదలైన ఐపీఎల్‌లో సొంత మైదానంలో ఆడుతున్న మ్యాచ్‌లను గెలుస్తున్న ఆతిథ్య జట్ల సంప్రదాయాన్ని రాజస్థాన్ తమ మలి పోరులోనూ కొనసాగించింది. జైపూర్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టాపార్డర్ విఫలమైనా రియాన్ పరాగ్ మెరుపులకు తోడు బౌలర్ల సమిష్టి ప్రదర్శన తోడై రెండో విజయాన్ని నమోదు చేసింది. ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్‌లో గెలవాలన్న కసితో కాకుండా ఏదో మ్యాచ్ ముగిసిపోతే బాగుండు అన్నట్టుగా ఆడింది. ఆఖర్లో ట్రిస్టన్ స్టబ్స్ పోరాడినా ఢిల్లీకి ఓటమి తప్పలేదు.

పరాగ్ (84*)

జైపూర్: ఏడాది కాలంగా దేశవాళీలో పరుగుల వరద పారిస్తున్న అస్సాం కుర్రాడు రియాన్ పరాగ్ మెరుపులకు తోడు బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో ఐపీఎల్-17 సీజన్‌లో రాజస్థాన్ రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌ను 12 పరుగుల తేడాతో గెలుచుకుంది. రాజస్థాన్ టాపార్డర్ విఫలమైనా పరాగ్ (45 బంతుల్లో 84 నాటౌట్, 7 ఫోర్లు, 6 సిక్సర్లు) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 5 వికెట్ల నష్టానికి 185 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో ఢిల్లీ.. 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 173 పరుగులకే పరిమితమైంది. డేవిడ్ వార్నర్ (34 బంతుల్లో 49, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) ఫర్వాలేదనిపించగా ట్రిస్టన్ స్టబ్స్ (23 బంతుల్లో 44 నాటౌట్, 2 ఫోర్లు,3 సిక్సర్లు) ఆఖర్లో పోరాడాడు. మిగిలిన బ్యాటర్లు చేతులెత్తేశారు. పరాగ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

టాపార్డర్ తుస్..

తొలుత రాజస్థాన్‌కు మరోసారి ఆశించిన ఆరంభం దక్కలేదు. గత సీజన్ నుంచి వైఫల్యాల బాట పట్టిన జోస్ బట్లర్(11) ,యశస్వీ జైస్వాల్ (5),కెప్టెన్ శాంసన్ (15).. రాజస్థాన్ 57/3 స్కోరుకు పరిమితమైంది.

పరాగ్ ఒక్కడే..

నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన పరాగ్ ఆరంభంలో నెమ్మదిగానే ఆడాడు. తొలి 26 బంతుల్లో అతడు చేసినవి 26 పరుగులే. కానీ బ్యాటింగ్‌లో ప్రమోషన్ పొంది ఐదో స్థానంలో వచ్చిన స్టార్ స్పిన్నర్ అశ్విన్ (19 బంతుల్లో 29, 3 సిక్సర్లు) ఉన్నంతసేపు స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అశ్విన్ - పరాగ్‌ల ద్వయం 37 బంతుల్లోనే 54 పరుగులు జతచేసింది. అశ్విన్ ఔట్ అయ్యాక పరాగ్ గేర్ మార్చాడు. ఖలీల్ అహ్మద్ వేసిన 15వ ఓవర్లో 6, 4, 4తో బాదుడుకు శ్రీకారం చుట్టాడు. ధ్రువ్ జురెల్ కూడా ఓ చేయి వేయడంతో రాజస్థాన్ స్కోరు వేగం పుంజుకుంది. జురెల్‌తో ఐదో వికెట్‌కు పరాగ్ 23 బంతుల్లోనే 52 రన్స్ జోడించాడు. ముకేశ్ వేసిన 16 ఓవర్ ఆఖరిబంతికి సిక్సర్ బాదిన పరాగ్.. 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. నోకియా వేసిన ఆఖరి ఓవర్లో పరాగ్.. 4, 4, 6, 4, 6, 1 తో విధ్వంసం సృష్టించడంతో రాజస్తాన్ భారీ స్కోరు చేసింది. మొదటి 10 ఓవర్లలో 57 పరుగులే చేసిన ఆ జట్టు ఆఖరి 60 బంతుల్లో 128 రన్స్ రాబట్టింది. ఇందులో పరాగ్‌వే 72 కావడం విశేషం. ఆరంభంలో 26 బంతుల్లో 26 రన్స్ చేసిన అతడు.. చివరి 19 బంతుల్లో 58 పరుగులు దండుకున్నాడు. ఐపీఎల్‌లో అతడికి ఇదే అత్యుత్తమ స్కోరు.

ఢిల్లీ పోరాడినా..

ఛేదనను ఢిల్లీ దూకుడుగానే ఆరంభించింది. నంద్రె బర్గర్ వేసిన రెండో ఓవర్లోనే మిచెల్ మార్ష్ మూడు ఫోర్లు బాదాడు. కానీ బర్గర్ ఢిల్లీకి ఒకే ఓవర్లో రెండు షాకులిచ్చాడు. మార్ష్‌తో పాటు భుయ్‌ను వెనక్కిపంపాడు. నాలుగో స్థానంలో వచ్చిన కెప్టెన్ పంత్ (26 బంతుల్లో 28, 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మూడో వికెట్‌కు 67 పరుగులు జతచేసి ఢిల్లీని పోటీలోకి తెచ్చాడు. బౌల్ట్, బర్గర్ బౌలింగ్‌లలో వార్నర్ భారీ షాట్లతో అలరించాడు. కానీ అవేశ్ ఖాన్ ఈ జోడీని విడదీశాడు. అతడు వేసిన 12వ ఓవర్లో వార్నర్.. సందీప్ శర్మకు చిక్కాడు. పంత్‌తో పాటు అభిషెక్ పొరెల్ (9)లను చాహల్ పెవిలియన్‌కు పంపాడు. ఆఖర్లో ట్రిస్టన్ స్టబ్స్.. అశ్విన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదగా సందీప్ వేసిన 19వ ఓవర్లో 6,4తో ఢిల్లీలో ఆశలు రేపాడు. ఆఖరి ఓవర్లో 17 పరుగులు అవసరం ఉండగా అవేశ్ ఖాన్ వేసిన ఆ ఓవర్లో 4 పరుగులు మాత్రమే ఇచ్చాడు.

సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 20 ఓవర్లలో 185/5 (రియాన్ 84 నాటౌట్, అశ్విన్ 29, అక్షర్ 1/21, ఖలీల్ 1/24) **ఢిల్లీ:** 20 ఓవర్లలో 173/5 (వార్నర్ 49, స్టబ్స్ 44 నాటౌట్, చాహల్ 2/19, బర్గర్ 2/29)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
చెన్నై	2	2	0	1.97	4
రాజస్థాన్	2	2	0	0.80	4
హైదరాబాద్	2	1	1	0.67	2
కోల్‌కతా	1	1	0	0.20	2
పంజాబ్	2	1	1	0.02	2
బెంగళూరు	2	1	1	-0.18	2
గుజరాత్	2	1	1	-1.42	2
ఢిల్లీ	2	0	2	-0.52	0
ముంబై	2	0	2	-0.92	0
లక్నో	1	0	1	-1.00	0

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

అమెరికా జట్టులో శాన్వి

నిలకడగా రాణిస్తున్న హైదరాబాదీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అమెరికా మహిళల జాతీయ క్రికెట్ జట్టులో హైదరాబాద్ మూలాలు ఉన్న ఇమ్మడి శాన్విక చోటు దక్కింది. యూఏఈలో జరుగనున్న వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో పోటీపడే అమెరికా తరపున శాన్వి ప్రాతినిధ్యం వహిస్తున్నది. 15 ఏండ్ల శాన్వి 2020లో శాన్‌రామన్ యూత్ క్రికెట్ అసోసియేషన్ కాలిఫోర్నియా తరపున క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. అండర్-13 అరంగేట్రంలోనే 9 వికెట్లు తీసి సత్తాచాటింది. ఇటీవల జరిగిన శాన్ డియాగో టీ20 టోర్నీలో 10 వికెట్లు పడగొట్టి జాతీయ జట్టుకు ఎంపికైంది. హైదరాబాద్‌కు చెందిన కోచ్ జగదీశ్‌రెడ్డి శిక్షణలో శాన్వి మరింత రాటుదేలింది. 1997లో కాలిఫోర్నియాలో స్థిరపడ్డ తండ్రి రమేశ్ ప్రసుత్తం సిస్కో సిస్టమ్స్‌లో ఉద్యోగం చేస్తున్నారు.

క్వార్టర్స్‌లో సింధు

మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్

మాడ్రిడ్: మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-14, 21-12తో హువాంగ్ యు సన్(చైనీస్ తైపీ)పై అలవోక విజయం సాధించింది. 36 నిమిషాల్లోనే ముగిసిన పోరులో సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. గతేడాది ఇదే టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన ఈ తెలుగు షట్లర్ క్వార్టర్స్‌లో సుపనిద కేతాంగ్ లేదా నసుకి నిదైరాతో తలపడనుంది.

ఐపీఎల్ బ్లాక్‌బస్టర్

ముంబై: ఐపీఎల్‌లో రికార్డుల పరంపర కొనసాగుతున్నది. మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారినట్లే..17వ సీజన్ తొలి పోరును రికార్డు స్థాయిలో అభిమానులు వీక్షించారు. చెన్నై, బెంగళూరు మధ్య జరిగిన మ్యాచ్‌ను ఏకంగా 16.8 కోట్ల మంది చూసినట్లు డిస్నీ స్టార్ గురువారం ప్రకటించింది. ఇది గత సీజన్‌తో పోల్చుకుంటే ఎక్కువని తెలిపింది.

కివీస్ ప్రసార హక్కులు సోనీకి

ముంబై: న్యూజిలాండ్ క్రికెట్ ప్రసార హక్కులను సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా సొంతం చేసుకుంది. 2024 మే 1 నుంచి 2031 వరకు ఏడేండ్ల పాటు భారత్, భారత ఉపఖండంలో టెలివిజన్, డిజిటల్ మీడియా హక్కులను సోనీ సంస్థ దక్కించుకుంది. దీనిలో భాగంగా 2026-27, 2028-31 భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనలో టెస్టులు, వన్డేలు, టీ20లు ఆడనుంది.

విహారికి షోకాజ్ నోటీసులు

విశాఖపట్నం: భారత క్రికెటర్, ఇటీవలే ముగిసిన రంజీ సీజన్ దాకా ఆంధ్రా క్రికెట్ జట్టుకు సారథిగా వ్యవహరించిన తెలుగు క్రికెటర్ హనుమా విహారికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) షోకాజ్ నోటీసులు పంపించింది. రంజీ ట్రోఫీ క్వార్టర్స్‌లో మధ్యప్రదేశ్ చేతిలో ఓడిపోగానే విహారి.. సోషల్ మీడియా వేదికగా తాను కెప్టెన్‌గానే గాక ఆటగాడిగానూ ఆంధ్రా జట్టుకు రాజీనామా చేస్తున్నానని, ఇక మళ్లీ ఆ జట్టుకు ఆడబోనని రాసుకొచ్చాడు. దీనిపై నెల రోజుల తర్వాత ఏసీఏ తాజాగా నోటీసులు పంపుతూ.. విహారి అప్పుడు అలా ఎందుకు స్పందించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని వాటిలో పేర్కొంది. ఇదిలా ఉంటే సహచర ప్లేయర్ విహారితో అమర్యాదకరంగా ప్రవర్తించడం ఈ వివాదానికి కారణమైన సంగతి తెలిసిందే.

సూర్య రాక ఆలస్యం

ముంబైకి తప్పని ఎదురుచూపులు

ముంబై: ఐపీఎల్-17లో వరుసగా రెండు మ్యాచ్‌లలో ఓడిన ముంబై ఇండియన్స్‌కు మరో ఎదురుదెబ్బ. ఆ జట్టు స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించక పోవడంతో అతడు ఈ లీగ్‌కు మరిన్ని రోజులు దూరం కానున్నాడు. మిడిలార్డర్‌లో కీలకమైన సూర్య లేకపోవడం ముంబైకి ఇబ్బందే. గత రెండు మ్యాచ్‌లలో అది స్పష్టంగా కనబడింది. స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ చేయించుకున్న సూర్యను ఆదరాబాదరగా ఐపీఎల్‌లో ఆడించి రిస్క్ తీసుకోలేమని బీసీసీఐ భావిస్తోంది. వరల్డ్ కప్ సూర్య ఫిట్‌నెస్ పట్ల బోర్డు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నది.

సమ్‌థింగ్ ఈజ్ ఫిషి!

హార్దిక్ X రోహిత్

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటి. పేరు ప్రఖ్యాతలు, ఫ్యాన్ బేస్, జట్టు విలువ పరంగా ఢోకా లేదు. మిగిలిన ఫ్రాంచైజీల కంటే ముందే ఐదు ట్రోఫీలు నెగ్గిన టీమ్. కానీ ఇదంతా నిన్నటి దాకా.. కెప్టెన్సీ మార్పు ఆ జట్టును మునిగిపోయే నావలా మార్చేసింది! అభిమానుల మద్దతు లేదు. ఆటగాళ్ల మధ్య సఖ్యత లేదు. జట్టులో సమన్వయం లేదు. డ్రెస్సింగ్ రూమ్‌లో రెండు వర్గాలుగా విడిపోయిన ఆటగాళ్లు.. వెరసి..ముంబై ఇండియన్స్‌లో సమ్‌థింగ్ ఈజ్ ఫిషి!

ముంబై: ముంబై ఇండియన్స్‌లో కెప్టెన్సీ మార్పు జట్టును రెండు గ్రూపులుగా విభజించిందా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తమ జట్టుకు ఐదు ట్రోఫీలు అందించిన మేటి సారథి రోహిత్‌శర్మను ఈ సీజన్‌కు ముందు తప్పించి గుజరాత్ టైటాన్స్ నుంచి అరువు తెచ్చుకున్న హార్దిక్‌ను కెప్టెన్‌గా నియమించడంపై అభిమానులు రెండు నెలల నుంచే అసహనంగా ఉండగా తాజాగా అది ముంబై డ్రెస్సింగ్ రూమ్‌కూ పాకిందని సమాచారం. హార్దిక్‌ను ముంబై కెప్టెన్‌గా ఊహించుకోవడానికి ఇష్టపడని ఆ జట్టు అభిమానులు.. ఎంఐ ఆడుతున్న మ్యాచ్‌లలో బహిరంగంగానే అతడిని హేళన చేస్తూ ఆగ్రహజ్వాలలు వెళ్లగక్కుతున్నారు. దీనికి కొనసాగింపుగా ముంబై డ్రెస్సింగ్ రూమ్‌లో 'టీమ్ రోహిత్' వర్సెస్ 'టీమ్ హార్దిక్'గా ఆటగాళ్లు విడిపోయినట్టు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

హార్దిక్ నిర్ణయాలపై గుర్రు..

మైదానంలో హార్దిక్ తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. స్టార్ పేసర్ బుమ్రాను పక్కనబెట్టి 3 లేదా 4వ ఓవర్లో (గత రెండు మ్యాచ్‌లలో ఇలాగే) బౌలింగ్‌కు దించడం.. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో అస్సలు అనుభవమే లేని సౌతాఫ్రికా పేసర్ క్వెనా మపాకాకు ఓపెనింగ్ ఓవర్ ఇవ్వడం, హైదరాబాద్ బ్యాటర్లు ఎడాపెడా పరుగులు రాబడుతున్నా కొయెట్జీతో వరుస ఓవర్లు వేయించడం వంటి నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు ఎంఐ సారథి మైదానంలో వ్యవహరిస్తున్న తీరు కూడా చర్చనీయాంశమవుతోంది. రోహిత్‌ను బౌండరీ లైన్ వద్దకు ఫీల్డింగ్‌కు పంపడాన్ని ముంబై అభిమానులైతే అస్సలు జీర్ణించుకోవడం లేదు.

రెండు వర్గాలు..

హార్దిక్ సారథ్యంపై ఇది వరకే బుమ్రా, సూర్యకుమార్‌యాదవ్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా తమ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. డ్రెస్సింగ్ రూమ్‌లోనూ బుమ్రా, తిలక్ వర్మ, ఆకాశ్ మధ్వాల్ వంటి పాత ముంబై ప్లేయర్లు ఒక వర్గంగా ఉండగా రోహిత్‌కు విధేయుడిగా ఉన్న ఇషాన్ కిషన్ ఇప్పుడు పాండ్యా గ్రూప్‌లో చేరినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అంబానీల అండ సంపూర్ణంగా ఉన్న హార్దిక్.. తన సొంత జట్టును నిర్మించుకునేందుకు గత సీజన్‌లో ఆడిన కీలక ప్లేయర్లను వదిలేసినట్టూ వార్తలు వస్తున్నాయి.

రోహిత్ నారాజ్..

కెప్టెన్సీ మార్పుపై ముంబై మాజీ సారథి రోహిత్ శర్మ ఇంతవరకూ బహిరంగంగా స్పందించకపోయినా అతడు అసంతృప్తిగానే ఉన్నట్టు కొంతకాలంగా వినిపిస్తోంది. హిట్‌మ్యాన్ ముంబై క్యాంప్‌లో చేరగానే హార్దిక్ వెళ్లి.. హగ్ చేసుకున్న ఫొటోలను ముంబై షేర్ చేసి 'అంతా బాగానే ఉంది' అన్నట్టు కవర్ చేయాలని చూసినా ఇదంతా 'ఉత్త కథే' అని ఇద్దరి మధ్య టీవీలలో సంభాషణలను చూస్తున్న వారికి అర్థమవక మానదు.

ఇది ఇలాగే కొనసాగితే ముంబైకి మరో సీజన్‌లోనూ నిరాశ తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి నానాటికీ ముదురుతున్న రోహిత్-హార్దిక్ వివాదాన్ని అంబానీలు ఎంత త్వరగా పరిష్కరిస్తానేది ఆసక్తికరంగా మారింది.

లఢక్‌లో ఏం జరుగుతున్నది?

- నివురు గప్పిన నిప్పులా యూటీ
- అభివృద్ధి ప్రాజెక్టులతో అస్తిత్వానికి ప్రమాదమని స్థానికుల ఆందోళన
- రాష్ట్ర హోదా కల్పించాలని డిమాండ్

లఢక్‌కు రాష్ట్ర హోదా కోరుతూ వాంగ్‌చుక్ తదితరుల నిరసన(ఫైల్)

లఢక్, మార్చి 28: కేంద్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందని లఢక్‌వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బయటి శక్తుల ప్రభావంతో తాము గిరిజన అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని.. అధికార వికేంద్రీకరణ జరిపి రాజ్యాంగ రక్షణలను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని కోసం లఢక్ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ ఇటీవల 21 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేశారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఈ దీక్ష కొనసాగుతున్నది. మార్చి 6న అంతర్గత మంత్రిత్వ శాఖతో జరిపిన తాజా చర్చలు ఫలించకపోవడంతో వందలాది మంది ఇటీవల లేహ్‌లో గుమిగూడి నిరసన తెలిపారు. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ ప్రకారం గిరిజన హోదా కలిగిన లఢక్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. శాసన, న్యాయ, పరిపాలన విభాగాలు ఏర్పాటు చేసి జనాభాలో 97 శాతం గిరిజనులు ఉన్న తమ ప్రాంతంలో కీలకమైన భూమి, అడవులు, నీరు, మైనింగ్ వంటి అంశాలపై ఆ విభాగాలు చట్టాలు చేసే అధికారం కల్పించాలని వారు కోరుతున్నారు.

భూములు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు

లఢక్‌లో బౌద్ధుల జనాభా అధికం. అయితే తమ ప్రాంతం పట్ల కశ్మీర్ ఆధారిత నాయకత్వం వివక్ష చూపుతున్నదన్నది స్థానికుల ఆరోపణ. పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయ ప్రాంతాన్ని సైనికీకరణ చేయడం, అభివృద్ధి ప్రాజెక్టులలో భాగస్వామ్యం లేకపోవడం, ఈ ప్రాంతాన్ని న్యూఢిల్లీ నుంచి నేరుగా నడపాలన్న నిర్ణయం స్థానికుల్లో ఆందోళనలను రేకెత్తించింది. చైనాతో ఉద్రిక్తతల మధ్య గత మూడేళ్లలో నిర్మించిన రహదారులు, వంతెనలు వంటి సైనిక అవసరాల కోసం సేకరించిన భూములు కోల్పోయిన స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ఒప్పందం ప్రకారం, లఢక్ ప్రజలు గతంలో కంటే తక్కువ ప్రాతినిధ్యం కలిగి ఉన్నారు. బయటి వ్యక్తులు ఈ ప్రాంతంలో స్థిరపడటానికి, వ్యాపారాలు ప్రారంభించడానికి కొత్త చట్టాలు అనుమతించడం స్థానికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దీని వల్ల పర్యావరణానికి హాని జరగడంతో పాటు తమ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడుతుందని వారు భావిస్తున్నారు. బోరాక్స్, బంగారం, గ్రానైట్, సున్నపురాయి, పాలరాతి వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రభుత్వం ఏడు జల విద్యుత్తు ప్రాజెక్టులు, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించడం పట్ల ఇక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాస్వామ్యం లేని అభివృద్ధి వద్దు

ప్రజలకు అభివృద్ధి ప్రాజెక్టులు కొంత సౌలభ్యాన్ని కలిగిస్తాయని, కానీ ఈ రకమైన అభివృద్ధిపై ఎవరూ ఆసక్తి చూపడం లేదని వాంగ్ చుక్ అన్నారు. ప్రజాస్వామ్యం లేకుండా అభివృద్ధితో ఉపయోగం ఏమిటని ప్రశ్నించిన ఆయన, కేవలం లాభాలపైనే ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలకు లఢక్ ఆటస్థలంగా మారుతున్నదని విమర్శించారు. వారికి భవిష్యత్తుపై గానీ, స్థానిక ప్రజలపై గానీ ఆసక్తి ఉండదన్నారు. కానీ ఆర్టికల్ 370 రద్దు, దానికి సంబంధించిన చర్యలే అంతిమమని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నట్లు కనిపిస్తున్నది.

'అగ్నివీర్'లో మార్పులకు సిద్ధమే : రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: సాయుధ దళాల్లో నియామకాల కోసం అమలు చేస్తున్న 'అగ్నివీర్' పథకంలో అవసరమైతే మార్పులు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. అగ్నివీరుల భవిష్యత్తు భద్రంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 'టైమ్స్ నౌ సమ్మిట్'లో ఆయన మాట్లాడుతూ, రక్షణ దళాల్లో యవ్వనం, జవసత్వాలు గలవారు ఉండాలన్నారు. యువత చాలా ఉత్సాహంగా ఉంటారని, వారు సాంకేతిక పరిజ్ఞానం గురించి ఆకళింపు చేసుకుని, పని చేస్తారని చెప్పారు. 'అగ్నిపథ్' లేదా 'అగ్నివీర్' పథకం ద్వారా సైన్యం, నావికా దళం, వాయు సేనల కోసం నియామకాలు జరుగుతాయి. ఎంపికైనవారు నాలుగేళ్లపాటు కాంట్రాక్టు పద్ధతిలో నియమితులవుతారు. ఈ నాలుగేళ్లలో ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఈ నాలుగేళ్లు పూర్తయిన తర్వాత సాయుధ దళాల్లో కొనసాగడానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

యూజీ కోర్సులకు కామన్ కౌన్సెలింగ్!

పరిశీలిస్తున్నామని యూజీసీ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 28: మెడికల్, ఇంజినీరింగ్ కోర్సులకు కామన్ కౌన్సెలింగ్ నిర్వహించినట్టుగానే సీయూఈటీ స్కోర్ ఆధారంగా వివిధ వర్సిటీల్లోని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు కామన్ కౌన్సెలింగ్‌ను చేపట్టే అంశాన్ని యూజీసీ పరిశీలిస్తున్నది. దీనిపై దేశంలోని వివిధ వర్సిటీల అధికారులతో ఓ కమిటీని ఏర్పాటుచేసినట్టు యూజీసీ వర్గాలు తెలిపాయి. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా తొలుత దీనిని ఐదు వర్సిటీల్లో చేపట్టే ఆలోచన ఉందని, ఎప్పట్నుంచి అమల్లోకి వస్తుందన్నది కమిటీ నిర్ణయిస్తుందని పేర్కొన్నాయి. 'ప్రస్తుతం వివిధ వర్సిటీల్లో యూజీ కోర్సుల కౌన్సెలింగ్ వేరు వేరుగా ఉంది. దీని స్థానంలో సింగిల్ విండో విధానం తీసుకురావాలని ఆలోచిస్తున్నాం. ఒకే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వివిధ వర్సిటీలకు దరఖాస్తులు చేసుకునేలా ఉంటుంది' అని యూజీసీ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర వర్సిటీల్లో యూజీ కోర్సుల అడ్మిషన్లకు 'సీయూఈటీ' స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నారు.

గ్యాంగ్‌స్టర్ ముక్తార్ అన్సారీ మృతి

లక్నో: గ్యాంగ్‌స్టర్, మాజీ ఎమ్మెల్యే ముక్తార్ అన్సారీ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఉత్తర ప్రదేశ్‌లోని బాందా వైద్య కళాశాలలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కౌశల్ తెలిపారు. బాందా జైలులో ఖైదీగా ఉన్న ఆయన ఆరోగ్యం క్షీణించడంతో జైలు అధికారులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సీఆర్‌పీసీ సెక్షన్ 144 ప్రకారం నిషేధాజ్ఞలను అమల్లోకి తీసుకొచ్చారు. ఎక్కువ మంది ఒకే చోట గుమికూడకూడదని పోలీసులు ఆదేశించారు. ముక్తార్ అన్సారీపై 60 క్రిమినల్ కేసులు విచారణలో ఉన్నాయి. ఆయనకు శిక్షలు పడటం 2022 సెప్టెంబరు నుంచి ప్రారంభమైంది. ఎనిమిది కేసుల్లో వేర్వేరు కోర్టులు శిక్ష విధించాయి.

రామేశ్వరం కేఫ్ పేలుడు కీలక నిందితుడి అరెస్ట్

న్యూఢిల్లీ, మార్చి 28: బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు కేసు దర్యాప్తులో కీలకమైన ముందడుగు పడింది. ఈ నేరంలో ముఖ్య నిందితుడిగా భావిస్తున్న వ్యక్తిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. కర్ణాటకలో 12 చోట్ల, తమిళనాడులో 5 చోట్ల, ఉత్తరప్రదేశ్‌లో ఒక చోట ఎన్ఐఏ బృందాలు దాడులు నిర్వహించాయని, ఈ నేపథ్యంలో పేలుడు కుట్రదారుల్లో ఒకడైన ముజామ్మిల్ షరీఫ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎన్ఐఏ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పేలుళ్లకు పాల్పడిన వ్యక్తిగా ముసావీర్ షాజీబ్ హుస్సేన్‌ను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. అబ్దుల్ మాథీన్ తహాను మరో కుట్రదారుడుగా ఎన్ఐఏ పేర్కొన్నది. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వీరిద్దరూ, ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరి ఆచూకీ కనిపెట్టేందుకు ఎన్ఐఏ బృందాలు దేశవ్యాప్తంగా గాలిస్తున్నాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.